# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్‌సింగ్ విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఈరోజు ప్రారంభించారు.
- ❖ వ్యర్థాల నుండి విద్యుత్ తయారీ ప్లాంట్లను రాష్ట్రంలో మరిన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు.
- ❖ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సాగుకు అవసరమైన సహకారం అందించేందుకు చర్యలు చేపట్టామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలియజేశారు.
- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల విద్యుత్ బస్ సర్వీసుల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 134వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

===================

ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ విశాఖపట్టణంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ (AMTZ) ను ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ టెక్స్‌టైల్స్ టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఆయన.. అత్యాధునిక వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ, స్టెరిలైజేషన్, 3D ప్రింటింగ్, శస్త్రచికిత్స పరికరాలు, అధునాతన బయోమెటీరియల్స్ తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం AMTZ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలో వ్యవసాయ రంగం తర్వాత.. టెక్స్‌టైల్ రంగం అత్యధిక ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. టెక్నికల్ టెక్స్‌టైల్స్ కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరామని చెప్పారు. మహిళా సాధికారతే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని తెలియజేసారు.

===================

ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ పల్నాడు జిల్లా కొండవీడు సమీపంలోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును ఈరోజు సందర్శించారు. వ్యర్థాల నుండి విద్యుత్ తయారీ ప్రక్రియను ఆసాంతం పరిశీలించిన ఆయన.. సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను సద్వినియోగం చేసుకునే విధంగా మరిన్ని ప్లాంట్లు నెలకొల్పేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇండోర్ మోడల్ లో చెత్తను వేరు చేసేలా పని చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశించారు. అలాగే గోదావరి నది నుండి వ్యర్థాలను వేరు చేసి.. విద్యుత్ తయారీకి ఏ విధంగా ఉపయోగించుకోవాలి అనే అంశాన్ని కూడా పరిశీలించాలని అధికారులను పవన్ కళ్యాణ్ కోరారు.

===================

ఖరీఫ్-2026 సీజన్‌లో రైతులకు సాగుకు అవసరమైన పూర్తి సహకారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఉత్పాదకత పెంపు, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహం, గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఖరీఫ్-2026 విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని పార్వతీపురంలో మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్-2026కు అవసరమైన 22 వేల 348 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందుబాటులో ఉంచినట్టు వెల్లడించారు. జీలుగ, కట్టె జనుము, పిల్లి పెసర విత్తనాలను పెద్ద ఎత్తున సరఫరా చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి.. సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ద్వారా 2023-24 సంవత్సరానికి సంబంధించి 802 టార్పాలిన్లు, 14 ఆయిల్ ఇంజన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సాలూరు, మక్కువ, పాచిపెంట మండలాల్లో మొత్తం 8 వేల 100 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు పీఎండీఎస్ కిట్లను అందజేస్తున్నట్టు మంత్రి వివరించారు.

===================

రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆధునీకరణకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో దశల వారీగా విద్యుత్ బస్సుల విస్తరణకు కార్యాచరణ సిద్ధమైందని, తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. `మహావాస్` పథకం కింద 300 ఈవీ బస్సుల కేటాయింపు జరిగిందని, మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల విద్యుత్ బస్సుల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయానికి విజయవాడ నుంచి 40 ప్రత్యేక బస్సులు నడుపుతామని, గోదావరి పుష్కరాలకు “గోదావరి” అనే పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులు నిర్వహిస్తామని వివరించారు. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదన్న మంత్రి.. పీపీపీ విధానంలో డిపోల ఆధునీకరణ చేపడతామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 28 సెకన్లు)

విరామం

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు ఉదయం 11 గంటలకు ఆకాశవాణిలో ప్రసారమయ్యే “మన్ కీ బాత్ - మనసులో మాట” 134వ సంచిక కార్యక్రమంలో దేశ ప్రజలతో తన భావాలను పంచుకుంటారు. ఈ కార్యక్రమం ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్ అంతటా, AIR News వెబ్‌సైట్, News on air మొబైల్ యాప్‌లో ప్రసారమవుతుంది. అలాగే, AIR News, DD News, PMO.. సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖల YouTube ఛానెల్లలో కూడా ఇది ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. హిందీ ప్రసారం ముగిసిన వెంటనే, ఆకాశవాణి ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ భాషల్లో ప్రసారం చేస్తుంది.

===================

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద విశాఖ నగరానికి కేంద్ర ప్రభుత్వం 1,500 కోట్ల రూపాయల విలువైన మూడు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను మంజూరు చేసిందని స్థానిక పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ తెలిపారు. జిల్లా

కలెక్టరేట్‌లో ఈరోజు నిర్వహించిన దిశా (DISHA) సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... మధురవాడ జోన్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, 24 గంటల తాగునీటి సరఫరా, నగర వ్యాప్తంగా బల్క్, సెమీ బల్క్ వాటర్ సప్లై వ్యవస్థల అభివృద్ధికి సంబంధించి ఈ ప్రాజెక్టులు మంజూరయ్యాయని తెలిపారు. పెరుగుతున్న నగర జనాభా దృష్ట్యా భవిష్యత్ సమస్యలను ముందుగానే అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా నగరాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ వినూత్న పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. విశాఖ నగరాన్ని పర్యావరణ పరిరక్షణతో కూడిన ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని శ్రీభరత్ స్పష్టం చేశారు.

==================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో గడచిన 12 సంవత్సరాలలో ఆర్థిక పునరుద్ధరణ, సామాజిక న్యాయం, జాతీయ భద్రతతో కూడిన కొత్త శకాన్ని దేశం చూస్తోందని పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన కొప్పుల నాగేశ్వరరావు అన్నారు. బలమైన నాయకత్వం ఉంటే సుపరిపాలన సాధ్యమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారధ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం నిరూపించిందని పేర్కొన్నారు. గరిష్ట పాలన-కనిష్ఠ ప్రభుత్వం సిద్ధాంతంతో గత 12 ఏళ్లుగా అభివృద్ధి వేగాన్ని పెంచారన్నారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం ద్వారా 81 కోట్లకు పైగా పేద ప్రజలకు ఎన్డీయే ప్రభుత్వం ఆహార కొరత లేకుండా చేసిందని పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించిందని కొప్పుల నాగేశ్వర రావు అన్నారు.

==================

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. రాజమండ్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈరోజు నిర్వహించిన తూర్పు గోదావరి జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాలువల మరమ్మతులు కొనసాగుతున్న ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలించి అవసరమైన మేరకు దశలవారీగా నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్టు తెలియజేశారు. రైతులు వర్షాలపై మాత్రమే ఆధారపడకుండా ముందస్తు నాట్లు వేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు.

==================

రేపు జరగనున్న ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతిలో ఈరోజు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలిపిరి రోడ్డులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు జరిగిన ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి. బాల కృష్ణనాయక్ జెండా ఊపి ప్రారంభించారు. శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద మానవహారం నిర్వహించి.. పొగాకు నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి.ఎం.హెచ్.ఓ. మాట్లాడుతూ.. పొగాకు వినియోగం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ తో పాటు ఇతర ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు.

==================

నైరుతి రుతుపవనాలు రానున్న 4, 5 రోజులలో అరేబియా సముద్రంలోని మరికొన్ని ప్రాంతాలకు, లక్షద్వీప్, కేరళం, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలియజేశారు. అలాగే ఈశాన్య, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింతగా విస్తరించే అవకాశం ఉందని తెలియజేశారు.

==================
==================